క్లుప్తంగా

గిరిజనేతరులకు న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న గిరిజనేతరులు

ఇంద్రవెల్లి: ఏజెన్సీ మండలాల్లో 1950 కంటే ముందు నుంచి నివసిస్తున్న గిరిజనేతరులకు న్యాయం చేయాలని గిరిజనేతర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో అధికారులు ఇళ్లు కూల్చివేయడంతో ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్ బంద్‌తో పాటు అంబేద్కర్ విగ్రహం ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఏజెన్సీలో నివసిస్తున్న గిరిజనేతరులు ఆదివాసీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలిసిమెలి సి జీవిస్తున్నార న్నారు. అధికారులే 1/70 చట్టం పేరుతో అక్రమాలను కూల్చివేయడం సరికాదన్నారు. కూల్చివేసిన భవనాలకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జాడి నాగోరావ్, మారుతి డొంగ్రె, దావుల రమేశ్, కేంద్రే మాధవ్, ఎండీ మసుద్, మీర్జా జీలానిబేగ్, ముండే బాబు, కేశవ్ ముస్లే పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రానున్నట్లు బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి రమణ ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే హాజరవుతారని మండల నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మంత్రిని పరామర్శించిన డీసీసీబీ చైర్మన్



మంత్రిని పరామర్శిస్తున్న అడ్డి భోజారెడ్డి

కై లాస్‌నగర్: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి చేరుకుని పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు సురేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

రేపు ఝురిలో వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఝురి గ్రామంలో ఈనెల 8న పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య శిబి రానికి జిల్లా ఎస్పీ గౌస్ అలం హాజరవుతారని అన్నారు. గిరిజన గ్రామాల నుంచి ఆరోగ్య స మస్యలతో బాధపడుతున్న వారు శిబిరానికి వ చ్చి వైద్యం చేయించుకోవాలని కోరారు. ఆయ న వెంట సీఐ రహీం పాషా, సిబ్బంది ఉన్నారు.

'స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారు'



సభ్యత్వం నమోదు చేస్తున్న బాబారావు

ఇచ్చోడ: యువత బీజేపీ సభ్యత్వం స్వచ్ఛందంగా తీసుకునేందుకు ముందుకు వస్తున్నారని బీజేపీ బోథ్ అసెంబ్లీ కన్వీనర్ కథం బాబారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ అమ్టె, బొడ్డు సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని నిలదీయాలి

ఆదిలాబాద్‌రూరల్: దుకాణాల్లో పని చేసే కార్మికుల సంక్షేమం కోసం ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని నిలదీయాలని రిటైర్డ్ కార్మిక శాఖ అధికారి చిట్యాల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని నేతాజీ చౌక్‌లో దుకాణాల్లో పని చేసే కార్మికులకు కార్మిక సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్మికులు ప్రశ్నించనిదే పథకాలు రావన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలవుతున్నా.. ఇప్పటి వరకు కార్మిక శాఖ మంత్రి లేడన్నారు. చట్టాలు, పథకాలు తెలియక కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు.

నిరుపయోగంగా బస్టాండ్



నిరుపయోగంగా బస్టాండ్

- తాత్కాలిక బస్టాండ్ వద్ద ప్రయాణికుల ఇబ్బందులు
- బస్సుల రాకపోకలతో రోడ్డు పనులకు అంతరాయం

ఇచ్చోడ: బస్టాండ్ పునరుద్ధరణకు ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకోకపోవడంతో లక్షల రూపాయలతో నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. తాత్కాలిక బస్టాండ్ వద్ద కనీస సౌకర్యాలు లేక నిత్యం ప్రయాణికులు ఇబ్బందికి గురవుతున్నారు. మండల కేంద్రంలో బస్సులు రాకపోకలతో రోడ్డు నిర్మాణం పనులకు సైతం ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అయినా.. అధికారులు మాత్రం బస్టాండ్ పునురుద్ధరణలకు చర్యలు తీసుకోవడం లేదు.

రోడ్లపై ప్రయాణికుల పడిగాపులు..

మండల కేంద్రంలో నిర్మల్ వైపు వెళ్లే ప్రయాణికులకు ఒక్క చోట, ఆదిలాబాద్ వైపు వెళ్లే ప్రయాణికుల మరోక చోట తాత్కాలిక బస్టాండ్‌లు ఏర్పాటు చేశారు. కానీ అక్కడి స్థలాల్లో కూర్చోవడం దేవుడేరుగు కానీ నిల్చోవడానికి కూడా స్థలం లేక పోవడంతో మహిళ ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చిరు వ్యాపారుల దుకాణాల వల్ల మహిళ ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆర్టీసీకి ఆదాయం మీద ఉన్న ప్రేమ ప్రయాణికులపై లేక పోవడంతో ప్రయాణికులకు శాపంగా మారింది. ఇచ్చోడ మండల కేంద్రం నుంచి రోజుకు కనీసం 5 వేల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఇంత మంది ప్రయాణికులు ప్రతీరోజు నరకయాతనకు గురవుతున్నారు.



బస్సు రోడ్డుపై నిలపడంతో ఏర్పడిన ట్రాఫిక్

రోడ్డు పనులకు ఆటంకం..

మండల కేంద్రంలో ఆదిలాబాద్ బైపాస్ నుంచి నిర్మల్ బైపాస్ వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈరోడ్డు గుండా ప్రతీ రోజు వందలాది బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు రోడ్డు పనులకు ఆటంకం కలుగుతుంది. తాత్కాలిక బస్టాండ్‌ల వద్ద బస్సులు నిలపడంతో గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను వెంటనే పునరుద్ధరించి, నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకు రావాలి. కొన్నేళ్ల నుంచి బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో శిథిలావస్థకు చేరింది. – నిమ్మల భాస్కర్‌రెడ్డి, ఇచ్చోడ

ఇబ్బంది పడుతున్నాం



తాత్కాలిక బస్టాండ్ వద్ద ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం నిల్చోవ డానికి కూడా ప్రయాణికులకు స్థలం లేక పోవడంతో నానా అవస్థలు పడున్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ చూపి బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించాలి. – జగన్, డిగ్నూర్, బజార్‌హత్నూర్ మండలం

అన్ని సంఘాల అభివృద్ధికి కృషి

- ఎంపీ గోడం నగేశ్



పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్‌రూరల్: మున్నూరుకాపులతో పాటు పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం మున్నూరుకాపు సంఘ భవనంలో ఎంపీ నిధులు రూ. 9.50 లక్షలతో నిర్మించే గ్రంథాలయ పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బీసీ సంఘాలకు పెద్దన్న పోషించే మున్నూరుకాపు సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మౌలిక వసతులు కావాలని కోరడంతో గ్రంథాలయం కోసం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్నా, ఆకుల ప్రవీణ్, మున్నూరుకాపు సంఘం ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, జైపాల్, కోరెడ్డి శంకర్, గంట సురేశ్, సంతోష్, శ్రీనివాస్, రఘుపతి, దారట్ల జీవన్, ప్రభావతి, జోగు రమణి పాల్గొన్నారు.

బంజారా భవనం నిర్మాణానికి..

భవనాలు నిర్మించడంతో పాటు వాటిని వినియోగించడంలో ముందుండాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం పిట్టల్‌వాడలో ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులు రూ. 2 కోట్లతో నిర్మించే బంజారా భవనం నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని బంజారా భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. తన ట్రస్ట్ ద్వారా బంజారా పిల్లలకు ఉచితంగా సివిల్స్, గ్రూప్స్ కోసం ఉచితంగా శిక్షణ ఇస్తానన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, కౌన్సిలర్లు పవన్‌నాయక్, అర్చన రాంకుమార్, ఉష్కం రఘుపతి, ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావ్, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

ఎదులాపురం: రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. గత 11 సంవత్సరాల నుంచి ప్రధాన మంత్రి మోదీ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పత్తికి గిట్టుబాటు ధర లేదని, మన్మోహన్ సింగ్ ప్రధాని ఉన్నప్పుడు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ధర పలికిందని, ప్రస్తుతం రూ.7వేల నుంచి రూ. 7200 ధర అందిస్తున్నారని మండిపడ్డారు. 8 శాతం తేమ ఉండాలనే నిబంధనతో సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే పత్తికి రూ.10వేల ధర ఇవ్వాలని, లేని సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కుంటాల రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ పాషా, అర్థాంగి రమేశ్, ఖండాల గణేష్, బెజ్జంకి నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

భీం వర్ధంతి విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆదివాసీ పెద్దలు

నార్నూర్: మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద ఈనెల 22న నిర్వహించే కుమురం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్ దేవ్, రాయిసెంటర్ జిల్లా సార్ మేడి మెస్రం దుర్గుపటేల్ కోరారు. మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో 17 గ్రామ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేసిన పోరాటయోధుడు కుమురం భీం 84వ వర్ధంతి నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యోగస్తులు, మేధావులు, తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు ఊర్వేత రూప్‌దేవ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్ రావు, మండల అధ్యక్షుడు ఆడ శ్రీరామ్, మాడవి రూప్ దేవ్, పూసం ఈశ్రు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



ముత్నూర్ దుర్గాదేవి ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆదివారం మహిళలు, యువతులు దుర్గాదేవి మండల వద్ద చేసిన దాండియా నృత్యం ఆకట్టుంది. మండల కేంద్రంలోని సర్వజనిక్ దుర్గాదేవి మండపం ఉత్సవం కమిటీ, హిందూ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి ముత్నూర్ గ్రామంలో కొండపై ఉన్న దుర్గాదేవి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రామపటేల్ మారుతి డొంగ్రె, ఫడ్ విశ్వానాథ్, బాబు ముండే, కేశవ్ ముస్లే, భక్తులు పాల్గొన్నారు.

నేరడిగొండ: దేవి శరన్నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ప్రతీ గ్రామంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. సాయంత్రం ఆయా మండపాల వద్ద మహిళలు దండియా ఆడుతూ ఆకట్టుకున్నారు.

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన స్వగ్రామమైన రాజురలో గల శ్రీజగదాంబ దేవి ఆలయాన్ని ఆదివారం దర్శించుకున్నారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తలమడుగు: మండలంలోని పల్సి(బి) గ్రామంలో బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పల్సి(బి), పల్సి(కె), కోసాయి, దేగమా, కప్పర్ దేవి, ఉమ్రీ గ్రామాల ప్రజలు వైద్య శిబిరానికి తరలివచ్చారు. రిమ్స్‌కు వైద్య సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మహారాష్ట్ర బ్యాంక్ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి కాంతారావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర బ్యాంక్ ఆల్ ఇండియా యునియన్ వైస్ ప్రసిడెంట్ కాడే స్వామి, యూనియన్ యూత్ ప్రెసిడెంట్, రవీందర్ నాథ్, శేఖర్, పంచాయతీ కార్యదర్శి సచిన్, తలమడుగు శాఖ మేనేజర్ శ్రీకాంత్, శ్రీనివాస్, వైద్యులు విజయ సారథి, నిఖిల్, పిల్లల వైద్య నిపుణులు హేమలత, గైనకాలజిస్ట్ చరిత, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద అవార్డు అందుకున్న రాజ్‌కుమార్



అవార్డు అందుకుంటున్న రాజ్ కుమార్

బోథ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగిన దక్షిణ భారతదేశ బహుజన సాహిత్య అకాడమీ ఎనిమిదవ రచయితల సమ్మేళనంలో సొనాల గ్రామానికి చెందిన రాజ్ కుమార్ స్వామి ఆదివారం వివేకానంద అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అందజేశారు. గుండెపోటు వచ్చినప్పుడు చేయవలసిన (సీపీఆర్), సైబర్ క్రైం నేరాలు, పర్యావరణ పరిరక్షణ, నవ సమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయుడి పాత్ర, స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశం, చరిత్రకు సజీవ సాక్షాలు నాణాలు, ఆడపిల్లల ఆవశ్యకత వారిని చదవనివ్వండి వారిని ఎదగనివ్వండి అనే అంశాలపై ఆయన చేస్తున్న సామాజిక సేవకు గుర్తుగా అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన 'కంది'



మహేశ్‌కుమార్ గౌడ్‌తో కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో భేటీ అయి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పలు రాజకీయ అంశాలతో పాటు పార్టీ పటిష్టతపై చర్చించారు.

జగదాంబ దేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

ఆదిలాబాద్: మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కేలాపూర్ జగదాంబ దేవి అమ్మవారిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరిపై అమ్మవారి దయ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

నర్సింహానందపై ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: మహ్మద్ ప్రవక్తపై యతి నర్సింహానంద సరస్వతి అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఖీజర్ పాషా అన్నారు. ఆదివారం పలువురు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావుకు ఫిర్యాదు చేశారు. మహ్మద్ ప్రవక్తను అవమానపర్చే విధంగా మాట్లాడారని సోషల్ మీడియాలో వైరల్ అవుతుందన్నారు. మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జమైతుల్ ఉల్మా జిల్లా ప్రధాన కార్యదర్శి హఫీజ్ అఫ్రోజ్, పట్టణ అధ్యక్షుడు అమీర్ పటేల్, మౌనలా వసీమ్, అహ్మద్, షకీల్ పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఈద్గా మైదాన పరిసరాలను యువకులు శుభ్రం చేశారు. ఆదివారం పట్టణానికి చెందిన పలువురు యువకులు ముందుకు వచ్చి ఈద్గాలోని ఖబ్రస్తాన్‌లో గల పిచ్చిమొక్కలు తొలగించారు. శ్రమదానం చేసిన వారిలో హాఫిజ్ ఆరీఫ్ ఖాన్, ఫిరోజ్, మౌలానా ఫారుఖ్, అజ్జు హుస్సేన్, జాఫర్, అబ్దుల్ రహీమ్, జాహిద్, కైఫ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

ఇచ్చోడ: మండలకేంద్రంలోని 44వ జాతీయ రహదారి నిర్మల్ బైపాస్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 55 ఏళ్ల మతిస్థిమితం లేని మహిళ మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్‌లోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. సంబంధీకులు ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

తప్పుడు వార్తలు సోషల్ మీడియాలో పెట్టవద్దు

బోథ్: తప్పుడు వార్తలను, సమాచారాన్ని వివిధ సోషల్ మీడియాలో షేర్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. మార్చిలో జరిగిన సంఘటనకు సంబంధించి నిజ నిజాలు తెలుసుకోకుండా కావాలని ఆదివారం ఒక వాట్సాప్ గ్రూప్‌లో కొంత మంది పోస్ట్ చేసిన సందర్భంగా ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా నిజాలను తెలుసుకోకుండా తప్పుడు వార్తలను షేర్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా బలరాం జాదవ్



బలరాం జాదవ్

నేరడిగొండ: రాష్ట్ర రాజధానిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ)ఎన్నికల్లో మరోసారి బలరాం జాదవ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో పలువురు ప్రముఖులు, సంఘ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జిల్లాల, ప్రాథమిక సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్మీడియట్ వ్యవస్థను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడంలో తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆలయంలో భక్తుల సందడి



మహాలక్ష్మి ఆలయంలో భక్తులు

సిరికొండ: మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయ ఆదివారం భక్తులతో కిటకిటాలాడింది. మండలంలోని లక్ష్మీపూర్, రాయిగూడ, ఇతర గ్రామాల గిరిజన భక్తులు కుటుంబసమేతంగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం జంతుబలులు ఇచ్చారు.

లక్ష పుష్పార్చన

ఆదిలాబాద్: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ద్వారకానగర్ కాలనీలో ఉద్దం నవ దుర్గ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆలయానికి పాదయాత్ర

ఆదిలాబాద్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి ఆదివారం పాదయాత్రను నిర్వహించారు. పట్టణంలోని దుర్గానగర్ కాలనీలో గల శ్రీనవశక్తి దుర్గామాత దేవాలయానికి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. భక్తి గీతాల నడుమ భక్తులు దేవీ నామస్మరణ చేస్తూ పట్టణ వీధుల గుండా ముందుకు సాగారు.